# భిన్న స్పర్శ

"జీపు దిగి పోలీసు స్టేషనులోకి నడిచి నా గదిలోకి వెళ్ళి నా కుర్చీలో కూర్చోబోతోంటే రంగయ్య వచ్చి ఫేన్ స్విచ్ నొక్కాడు. గదిలో ఉక్కగా ఉంది. కుర్చీలో కూర్చుని చేతి గడియారం వంక చూసుకున్నాను. ఒకటీ అయిదయింది.

రంగయ్య వెళ్ళిపోబోతోంటే, "నాకో గ్లాసు మంచి నీళ్ళు తెచ్చి పెట్టు. టీ ఉందా?" అడిగాడు.

"ఉందిసార్."

"వేడిగా ఉందా?"

తలూపాడు.

"పట్టుకురా."

రంగయ్య తలూపి గది బయటకు వెళ్ళిపోయాడు.

గదిలో గాలి వేడిగా తిరుగుతోంది. చొక్కా పయి గుండీలు రెండు మూడు విప్పి బెల్టు వదులు చేసుకుని కుర్చీలో చేరగిలబడి కూర్చున్నాను. చీకటి గుమ్మం దగ్గరే ఆగి ఉంది. పగటి పూట ఎంతో హడావిడిగా ఉండే స్టేషను రాత్రుళ్ళు ఎప్పుడోగాని గొడవగా ఉండదు.

హెడ్ కానిస్టేబుల్ గదిలోకి రాగానే, "మస్కిటో కాయిలు ఈ గదిలో వెలిగించి పెట్టే ఏర్పాటు చేయకూడదా రసూల్?" అడిగాను.

"పెట్టిస్తాన్ సార్."

"ఎవరయినా ఫోను చేశారా?"

"లేదండీ."

"కేసులు ఏమయినా వచ్చాయా?"

"నరసింహం, చలపతి ఒకతన్ని తీసుకువచ్చారు. సెల్‌లో పెట్టాం."

"కేసేమిటి?"

"తీవ్రవాది అన్న అనుమానం మీద పట్టు కొచ్చారు"

"స్క్వాడ్ వాళ్ళకు ఫోను చేసి చెప్పలేదా?"

"చెప్పలేదు సార్. ముందు మీతో మాట్లాడిన తర్వాత వాళ్లకు ఫోను చేస్తే బావుంటుందని ఆగాను."

"చలపతిని రమ్మనమను" అన్నాను.

రసూల్ వెళ్ళి పోయాడు.

రెండు నిమిషాల తర్వాత చలపతి నా గదిలోకి వచ్చి సెల్యూట్ చేసి బల్ల దగ్గరకు వచ్చి నిలబడ్డాడు.

"ఎవర్ని పట్టు కొచ్చింది?" అడిగాను.

"తీవ్రవాదిలా ఉన్నాడండీ."

"తీసుకు వచ్చి ఎంతసేపు అవుతుంది?"

"అరగంట".

"అతను తీవ్రవాది అని ఎందుకు అనుమానం వచ్చింది?"

"ఒకతను సమాచారం ఇచ్చాడండీ"

"సెర్చ్ చేశారా?"

చలపతి తలూపాడు.

"ఏమయినా దొరికాయా?"

వెంటనే జవాబు చెప్పలేదు.

"పిస్తోలుకాని, కత్తికాని, బాంబులుకాని.... కనీసం వాళ్ల పుస్తకాలు కాని దొరికాయా?"

"అటువంటివేం దొరకలేదు సార్".

"మీరు పట్టుకోబోయే ముందు అతనేం చేస్తున్నాడు?"

"సైకిలు మీద వీధుల్లో తిరుగుతున్నాడు. నేనూ నరసింహం గంటపాటు వెంబడించి చివరకు పట్టుకుని అర్థరాత్రప్పుడు వీధుల్లో ఎందుకు తిరుగుతున్నావని నిలదీసి అడిగాం. సరయిన సమాధానం చెప్పలేదు. మమ్మల్నే దబాయించడం మొదలెట్టాడు. నాలుగు పీకితే, 'మీతో మాట్లాడడం అనవసరం. నా మీద మీకు ఎటువంటి అనుమానం ఉన్నా మీ యస్.ఐ. దగ్గరకో, సి.ఐ. దగ్గరరో తీసుకెళ్ళండి. వాళ్ళతోనే మాట్లాడుతాను' అన్నాడు. తీసుకొచ్చి సెల్‌లో పడేశాం. మొండి ఘటంలా ఉన్నాడు".

"నువ్వెళ్ళి అతన్నిక్కడకు పంపించు."

చలపతి బయటకు వెళ్తోంటే, "రంగయ్యా" పిలిచాను.

"అయ్యా, వచ్చే" మాట వెనకే రంగయ్య వచ్చాడు.

గ్లాసు అందుకుని నీళ్లు తాగి ఖాళీగ్లాసు బల్ల మీద పెట్టి, "టీ బల్ల మీద పెట్టు. నువ్వెళ్ళి మస్కిటో కాయిల్ పంపించమని రసూల్‌తో చెప్పు" అన్నాను.

రంగయ్య బయటకు వెళ్ళి వెంటనే కాయిల్‌తో వచ్చి బల్ల కింద పెట్టి వెళ్తోంటే తీవ్రవాదిగా అనుమానించబడిన వ్యక్తి గదిలోకి వస్తూ నమస్కారం చేశాడు. తలూపుతూ అతన్ని పరిశీలనగా చూశాను. అతనికి ముప్పయి సంవత్సరాలుంటాయేమో, చామన చాయలో ఉన్నాడు. అంత పొడుగూ కాదు, పొట్టీ కాదు, సన్నగా ఉన్నాడు.

"కూర్చోండి" కుర్చీ చూపించాను.

కూర్చున్నాడు. అతను వేసుకున్న తెల్లటి చొక్కా చినిగి పోయి ఉంది. మా వాళ్లు బాగానే కొట్టినట్టున్నారు. ముఖం వాచి పోయి ఉంది. కింద పెదవి చిట్లి కమిలి పోయి ఉంది.

గ్లాసులోని టీ సగం కప్పులోని పోసుకుని అతనికి గ్లాసు ఇస్తూ, "తీసుకోండి" అన్నాను.

"థేంక్స్" అని గ్లాసు అందుకున్నాడు.

అతను టీ తాగిన తర్వాత "మీ పేరు?" అడిగాను.

"కోటయ్య".

"మీదే ఊరు?"

"శ్రీకాకుళం".

"ఏం చేస్తుంటారు?"

"అక్కడే గవర్నమెంటు డిగ్రీ కాలేజీలో ఇంగ్లీషు లెక్చరరుగా పనిచేస్తున్నాను. స్పాట్ వేల్యుషన్ నిమిత్తం ఈ ఊరు వచ్చాను. పోర్టు ట్రస్ట్‌లో పని చేస్తున్న నా స్నేహితుడి ఇంట్లో దిగాను. స్పాట్ వేల్యుయేషన్ మొన్నటితో ముగిశాక దాని తాలూకు డబ్బులు అందుకున్నాను. నాకున్న దాంట్లో కొద్దో గొప్పో దీనాతిదీనంగా బతుకుతున్న వాళ్లకు డబ్బు రూపేణా కాకుండా వస్తు రూపేణా ఇవ్వడం నా అలవాటు. ఈ సంగతి ఎవరికి తెలియకుండా చేస్తుంటాను. నన్ను అనుమానించి మీ వాళ్లు ఇక్కడకు తీసుకువచ్చారు. కాబట్టి మీకు చెప్పవలసివస్తోంది. నాకు వచ్చిన డబ్బుతో రగ్గులో, దుప్పట్లో కొని ఫుట్‌పాత్‌ల మీద, చెట్ల కింద పడుకునే వాళ్ళకు పంచి పెడుతుంటాను.

ప్రతిసారీ ఇలానే చేస్తుంటాను. మొన్న ఇరవయి రగ్గులు కొని రిక్షా మాట్లాడుకుని పది రగ్గులు వరకు పంచి పెట్టాను. ఇంకో పది మిగిలాయి. మొన్న నా కూడా వచ్చిన రిక్షా వాడిని ఈ రాత్రికి రమ్మని అడిగితే వందరూపాయలు ఎక్కువ ఇస్తేనే కాని రానన్నాడు. వాడితో లాభం లేదనుకుని మరో నలుగురిని అడిగాడు. ఈ రిక్షా వాళ్ళందరూ ఒకే యూనియన్ మనుషులనుకుంటాను. అందరిదీ ఒకే మాట అయింది. ఇహ లాభం లేదనుకుని సైకిలు అద్దెకు తీసుకుని రగ్గులు క్యారియర్‌కు కట్టుకుని వీధులు తిరగడం మొదలెట్టాను. దాదాపు అన్నీ అయి పోయాయి. రెండో మూడో మిగిలాయి. అవీ పంచేస్తే నా పని ముగుస్తుంది. అంతలో మొన్న నా కూడా వచ్చిన రిక్షా వాడే మీ పోలీసులను తీసుకువచ్చాడు. వాడు నా గురించి మీ వాళ్లకు ఏమని చెప్పాడో తెలియదు. మీ వాళ్లు నన్ను పట్టుకున్నారు. నేను చెప్పేదేదీ వాళ్ళు వినిపించుకోలేదు. ఇష్టం వచ్చినట్టు మాట్లాడుతూ బూతులు తిడుతోంటే బూతులు ఎందుకు తిడుతున్నారని అడిగినందుకు నన్ను కొట్టి చొక్కా పట్టుకొని పోలీసుస్టేషన్‌కు లాక్కొస్తోంటే నా ఐడెంటీటీ కార్డు ఎక్కడో పడిపోయింది. నా కళ్ళజోడు కిందపడి పగిలిపోయింది.... మీకు నా స్నేహితుడి అడ్రసిస్తాను. మీ వాళ్ళను ఎవరినయినా పంపించి నా గురించి వాకబు చేయించండి..." ఆవేశంగానే మాట్లాడాడు.

కొద్ది సేపు మవునంగా ఉండి అతని ఆవేశం తగ్గాక లేచి నిలబడి "మిమ్మల్ని నమ్ముతున్నాను. మీకు జరిగిన దానికి బాధపడుతున్నాను. మా వాళ్ళ తరపున క్షమించమని కోరుకుంటున్నాను..." అంతకన్నా ఏమనాలో నాకు అర్థం కావడం లేదు.

అతను లేచినిలబడ్డాడు.

నా ఇరవయి సంవత్సరాల సర్వీసులో ఇష్టం ఉన్నా లేకపోయినా, అర్హులయినా కాకపోయినా ఉద్యోగ రీత్యా నా పై అధికారులకు, నేతలకు ఎందరికో ఎన్నో సార్లు సెల్యూట్ చేశాను. కోటయ్యకు మటుకు మనఃపూర్వకంగా సెల్యూట్ చేయకుండా ఉండలేకపోయాను.

❖ ఆంధ్రప్రభ సచిత్ర వార పత్రిక, 29 మే 1996